ధర్మపురి క్షేత్రంలో భక్తుల రద్దీ

స్వామివారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

ధర్మపురి, నవంబర్18: కార్తీక సోమవారం సందర్భంగా ధర్మపురి క్షేత్రం భక్తులతో కిటకిటలాడింది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చి భక్తులు, ముందుగా గోదావరిలో స్నానం చేసి సంకల్పాది పూజలు చేశారు. ప్రధాన ఆలయంతో పాటు అనుబంధ ఆలయాల్లో స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో ఉసిరిక చెట్టు వద్ద దీపాలను వెలిగించారు.

సంకష్టహర చతుర్థి పూజలు..

ధర్మపురిలోని రామలింగేశ్వరాలయంలోని గణపతి మండపంలో సోమవారం సంకష్టహర చతుర్థి సందర్భంగా గణపతిస్వామివారికి అభిషేకం, హారతి, మంత్రపుష్పం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పూజల అనంతరం భక్తులు గణపతి స్వామివారిని దర్శించుకున్నారు.

సర్వే గడువు పొడిగించాలి

జగిత్యాల టౌన్, నవంబర్ 18: సమగ్ర కుల గణన సర్వే గడువును పొడిగించాలని తెలంగాణ రాష్ట్ర కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మ్యాన పవన్‌కుమార్ కోరారు. సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన టీఎస్‌సీపీఎస్‌ఈయూ సంఘ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వే రాష్ట్రంలో ఆదివారం వరకు 58 శాతం మాత్రమే పూర్తయ్యిందన్నారు. ఒక్కో కుటుంబం వివరాలు సేకరించేందుకు చాలా సమయం పడుతున్నదన్నారు. రాష్ట్రం నుంచి మహారాష్ట్రకు వలస వెళ్లిన వారిలో చాలా మంది ఉన్నారని, అక్కడ ఎన్నికల కారణంగా స్వరాష్ట్రానికి తిరిగి రాలేదన్నారు. నిర్ణీత సమయంలో సర్వే పూర్తయ్యే అవకాశం లేనందున సర్వే గడువును పెంచాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గంగాధరి మహేశ్, ప్రధాన కార్యదర్శి సర్వ సతీష్, కోశాధికారి గొల్లపల్లి మహేశ్‌గౌడ్, బోగ శ్రీనివాస్, బండారి సతీశ్, జనార్దన్ పాల్గొన్నారు.

బైక్ అదుపుతప్పి ఒకరి మృతి

కథలాపూర్, నవంబర్ 18: దూలూర్ గ్రామానికి చెందిన జూపాక నర్సయ్య (62) రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. ఎస్ఐ నవీన్‌కుమార్ కథనం ప్రకారం.. నర్సయ్య ఆదివారం సాయంత్రం బైక్‌పై భూషణరావుపేట శివారులో మర్రవ్వ ఆలయం వద్ద భోజనానికి వెళ్లి తిరిగి స్వగ్రామానికి వస్తున్నాడు. భూషణరావుపేట శివారు మూలమలుపు వద్ద బైక్ అదుపుతప్పి చెట్టుకు ఢీకొన్నాడు. తీవ్రగాయాలు కావడంతో స్థానికులు కోరుట్ల దవాఖానకు తరలించారు. అప్పటికే నర్సయ్య మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. నర్సయ్య కొడుకు కిరణ్ ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

న్యాయం చేయాలని భర్త ఇంటి ఎదుట భార్య నిరసన

కోరుట్ల, నవంబర్ 18: తనను, తన పిల్లలను మానసిక వేధిస్తున్నాడని, తనకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ భర్త ఇంటి ఎదుట భార్య నిరసన తెలిపిన ఘటన కోరుట్లలో సోమవారం జరిగింది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని వినోభా రోడ్డు కాలనీకి చెందిన వినోద్‌తో వనితకు 24 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి మనీష్, మాళవిక ఇద్దరు పిల్లలు. కొద్ది నెలలుగా తనను వినోద్ మానసిక క్షోభకు గురి చేయడంతో పాటు పిల్లలను కొట్టడంతో ప్రాణ భయంతో ఇంటి నుంచి వెళ్లి కిరాయికి ఉంటున్నట్లు పేర్కొన్నది. అయితే తనకు తెలియకుండా తన భర్త మరో వివాహం చేసుకున్నాడని, తన పిల్లలకు న్యాయం చేయాలని ఎన్నిసార్లు వేడుకున్నా పట్టించుకోవడం లేదని వాపోయింది. చేసేదేంలేక సోమవారం తన పిల్లలతో కలిసి న్యాయం చేయాలని భర్త ఇంటి ఎదుట బైఠాయించి నిరసన తెలిపింది. సమాచారం అందుకున్న పోలీసులు భార్య, భర్తను స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చి పంపించారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇస్తేనే
చదువులు.. లేకుంటే లేదు

- నేటి నుంచి నిరవధిక బంద్‌లోకి ప్రైవేట్ డిగ్రీ కాలేజీలు
- 20 నుంచి అన్ని విశ్వవిద్యాలయాల పరిధిలో డిగ్రీ సెమిస్టర్ పరీక్షలను బాయ్‌కట్ చేస్తూ సమ్మెలోకి కాలేజీ యాజమాన్యాలు

ఉన్నత విద్యా మండలి చైర్మన్‌కి ఇచ్చిన సంఘం ఇచ్చిన వినతిపత్రం

జగిత్యాల, నవంబర్ 18(నమస్తే తెలంగాణ): రాష్ట్ర వ్యాప్తంగా ప్రైవేట్ డిగ్రీ, పీజీ కాలేజీలు మంగళవారం నుంచి నిరవధిక సమ్మెలోకి వెళ్తున్నాయి. రాష్ట్రంలోని దాదాపు 800 కాలేజీల్లో చదువుతున్న విద్యార్థులకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన ఆర్‌టీఎఫ్ (రీయింబర్స్‌మెంట్ ఆఫ్ ట్యూషన్ ఫీ)నిధులు రెండున్నరేండ్లుగా ఇవ్వకపోవడంతో కాలేజీల మనుగడ సాధ్యం కాదంటూ, కళాశాలల యాజమాన్యాలు నిరవధిక బంద్‌లోకి వెళ్తున్నాయి. ఇప్పటికే అక్టోబర్‌లో నాలుగు రోజుల పాటు నిరవధిక బంద్ పాటించిన యాజమాన్యాలు, ఆనాడు నాలుగు రోజుల్లో ఆర్‌టీఎఫ్ నిధులు మంజూరు చేస్తామన్న విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి హామీ మేరకు సమ్మెను విరమించాయి. అయితే ఆ హామీ అమలు కాకపోవడం, సీఎం రేవంత్‌రెడ్డి, ప్రైవేట్ కాలేజీల యాజమాన్యానికి కనీసం తమ బాధ చెప్పుకునేందుకు సైతం అపాయింట్‌మెంట్ ఇవ్వకపోవడంతో ప్రైవేట్ డిగ్రీకాలేజీలు సమ్మె బాట పట్టాయి.

డిగ్రీ, పీజీ కాలేజీలకు రెండున్నర విద్యా సంవత్సరాల బకాయిలు..

గత ప్రభుత్వం వీలైనంతగా ప్రైవేట్ కాలేజీలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇచ్చేందుకు యత్నిస్తూ వచ్చింది. అయితే ప్రభుత్వం ఇచ్చే నిధులు ఎక్కువగా టెక్నికల్ కోర్సులు ఉన్న కాలేజీలకు పోవడం ఆరంభమైంది. దీంతో సాధారణ డిగ్రీ కాలేజీలకు నిధులు సరిగా మంజూరుకాక తీవ్రంగా ఇబ్బందిపడ్డాయి. ఈ నేపథ్యంలో సాధారణ కాలేజీలు అప్పటి ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్‌ను కలిసి తమ బాధలన్నింటినీ తెలియజేయగా, ఆయన రీయింబర్స్‌మెంట్ విడుదల విషయంలో కొత్త పాలసీని సృష్టించారు. రీయింబర్స్‌మెంట్ నిధుల్లో ప్రొఫెషనల్ కోర్సులకు 70 శాతం, 30 శాతం నిధులు నాన్ ప్రొఫెనల్ కోర్సులకు కేటాయించేలా చర్యలు తీసుకునేందుకు చొరవ చూపారు. దీంతో పరిస్థితిలో కొంత మార్పు వచ్చింది. 2021-2022 విద్యా సంవత్సరంలో 90 శాతం ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు కాలేజీలకు అప్పటి ప్రభుత్వం చెల్లించింది. అయితే కరోనా విజృంభన నేపథ్యంలో 2022-2023 విద్యా సంవత్సరంలో ప్రైవేట్ డిగ్రీ, పీజీ కాలేజీలకు నిధులు మంజూరులో జాప్యం జరిగింది. 2023 ఆగస్టులో అప్పటి కేసీఆర్ సర్కార్ ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం రూ.500 కోట్లను మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.. టోకెన్లు ఎస్టీఓ కార్యాలయాలకు చేరి నిధులు కాలేజీల అకౌంట్లలోకి జమ అవుతాయన్న సమయంలోనే ఎన్నికల కోడ్ విడుదలైంది. దీంతో రూ.500 కోట్లు నిలిచిపోయాయి.

మొఖం చాటేసిన రేవంత్.. హామీ ఇచ్చి మరిచిన ప్రభుత్వం

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లిస్తామని చెప్పి హామీనిచ్చిన రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రైవేట్ డిగ్రీ, పీజీ కాలేజీలకు మొహం చాటేశారు. కలిసి తమ వేదనను చెప్పుకునేందుకు యాజమాన్యాల సంఘం ప్రయత్నించినా, కనీసం వారికి అపాయింట్‌మెంట్ సైతం ఇవ్వక అవమానించారు. విపరీతంగా పెరిగిన అప్పులు, చెల్లించలేని అద్దెలతో ఇబ్బందులు పడుతున్న కాలేజీ యాజమాన్యాలు అక్టోబర్‌లో దసరా సెలవుల అనంతరం కాలేజీలను మూసివేసి నిరసన తెలియజేయడం ఆరంభించాయి. నాలుగు రోజుల తర్వాత విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి యాజమాన్యాలతో చర్చించి, నాలుగు రోజుల్లో నిధులు మంజూరు చేయిస్తానని, సీఎం హామీ ఇచ్చారని చెప్పడంతో కాలేజీ యాజమాన్యాలు కాలేజీలను నిర్వహించడం ఆరంభించాయి. అయితే నెల రోజులు గడిచినా నిధులు రాకపోవడం, సీఎం అపాయింట్‌మెంట్ ఇవ్వకపోవడం, విద్యాశాఖ కార్యదర్శి చేతులు ఎత్తివేయడంతో కాలేజీ యాజమాన్యాలు విసిగిపోయి మరోసారి నిరవధిక బంద్‌తో పాటు, గ్రూప్ 3 పరీక్షలకు సైతం సెంటర్లు ఇవ్వవద్దని తీర్మానించుకున్నాయి.

గ్రూప్-3 పరీక్షల సమయంలో కాలేజీ యాజమాన్యాలపై ఒత్తిడి

గ్రూప్-3 పరీక్షలకు పలు ప్రైవేట్ డ్రిగీ, పీజీ కాలేజీలను కేంద్రాలుగా కేటాయించారు. ఈ మేరకు హాల్ టికెట్ల సైతం పంపిణీ చేశారు. తీరా పరీక్ష సమయం సమీపించిన తరుణంలో ప్రైవేట్ కాలేజీల యాజమాన్యాలు గ్రూప్-3 పరీక్షలకు సెంటర్లను ఇవ్వవద్దని తీర్మానించుకోవడం, ఆ విషయం బయటకు రావడంతో ప్రభుత్వ పెద్దలు అలర్ట్ అయ్యారు. పోలీసులతో పాటు విద్యాశాఖ, ఇతర శాఖల అధికారులతో ప్రైవేట్ కాలేజీల యాజమాన్యంపై ఒత్తిడి తేవడం ఆరంభించారు. ఒకరోజు ముందే సెంటర్లను అధీనంలోకి తీసుకునే ప్రయత్నం చేశారు. గ్రూప్-3 పరీక్షలకు ఇబ్బందులు వస్తే, కాలేజీలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వ బెదిరింపులతో పాటు, నిరుద్యోగ యువతను దృష్టిలో పెట్టుకొని ప్రైవేట్ కాలేజీల యాజమాన్యాలు ఇబ్బందులు పెట్టకుండా మిన్నకుండిపోయారు. అయితే పరీక్షలు ముగిసిన తర్వాత మరోసారి ప్రభుత్వంతో పోరాటానికి సిద్ధమయ్యారు.

సెమిస్టర్ పరీక్షలు బాయ్‌కట్.. కాలేజీలు నిరవధిక మూసివేత

ఈ నెల 20వ తేదీ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని విశ్వవిద్యాలయ పరిధిలో డిగ్రీ తరగతులకు సంబంధించిన సెమిస్టర్లు ప్రారంభమవుతున్నాయి. 20న మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం పరిధిలోని డిగ్రీ కాలేజీ విద్యార్థులకు 1, 3, 5 సెమిస్టర్లు, తర్వాత మిగిలిన విశ్వవిద్యాలయాల పరిధిలో సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం అవుతున్నాయి. ఈ నేపథ్యంలో వాటిని బాయ్‌కట్ చేస్తూ, పరీక్షల నిర్వహణ చేయమని, అలాగే కాలేజీలను నిరవధికంగా మూసివేస్తామంటూ తెలంగాణ ప్రైవేట్ డిగ్రీ కాలేజీల యాజమాన్య సంఘం తీర్మానించింది. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య బాలక్రిష్ణారెడ్డికి సంఘం వినతిపత్రం అందజేసింది.

విధి లేని పరిస్థితుల్లోనే.. నిరవధిక బంద్

విధిలేని పరిస్థితుల్లోనే నిరవధిక బంద్‌కు వెళ్తున్నాం. రెండున్నరేండ్లుగా అష్టకష్టాలు పడుతూ, కాలేజీలను నిర్వహిస్తున్నాం. ప్రతి కాలేజీకి ప్రభుత్వం కోట్లల్లో బకాయిలు పడింది. ప్రభుత్వం నిధులు ఇవ్వకపోతే కాలేజీలు నడపలేని పరిస్థితుల్లో ఉన్నాం. లెక్చరర్లు, ఇతర సిబ్బందికి వేతనాలు ఇవ్వడం, అద్దెలు, కరెంట్ బిల్లులు చెల్లించడం చాలా కష్టంగా మారింది. కాలేజీల నిర్వహణకు చాలా మంది కరస్పాండెంట్లు అప్పులు చేసి, వడ్డీలు కట్టలేని పరిస్థితుల్లో ఉన్నారు. ఇప్పటికే ఒత్తిడి భరించలేక ఒక కరస్పాండెంట్ గుండెపోటుతో చనిపోయారు. చాలా మంది అనారోగ్యాలకు గురవుతున్నారు. ప్రభుత్వాన్ని కలిసి విన్నవించేందుకు ఎన్నిసార్లు ప్రయత్నించినా పట్టించుకోవడం లేదు. దసరా తర్వాత నిరవధికంగా బంద్ చేస్తే నాలుగు రోజుల్లో ఇస్తామన్నారు. నెల రోజులైనా స్పందన లేదు. సీఎం అపాయింట్‌మెంట్ సైతం లభించలేదు. ఇలాగే పరిస్థితి కొనసాగితే చాలా మంది కరస్పాండెంట్లు ఒత్తిడితో కుప్పకూలే పరిస్థితి ఉంది. అందుకే బంద్ చేయాలని నిర్ణయించుకున్నాం. ఏడు లక్షల మంది విద్యార్థులు, 800 కాలేజీలు, దాదాపు లక్షన్నర మంది బోధన, బోధనేతర సిబ్బంది రోడ్డున పడే పరిస్థితి వచ్చింది. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి రీయింబర్స్‌మెంట్ నిధులను మంజూరు చేయాలి.

- యాద రామక్రిష్ణ, ప్రైవేట్ డిగ్రీ కాలేజీల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

21న ధ్రువ పత్రాల పరిశీలన

కమాన్‌చౌరస్తా, నవంబర్ 18 : జిల్లాలోని కేజీబీవీ పాఠశాలలలో ఖాళీగా ఉన్న టీచింగ్ పోస్టులకు కాంట్రాక్ట్ పద్ధతిలో 2023 సంవత్సరంలో నిర్వహించిన అర్హత పరీక్షలో ఉత్తీర్ణులైన వారి ధ్రువ పత్రాల పరిశీలన 21న ఉంటుదని జిల్లా విద్యాశాఖాధికారి జనార్దన్‌రావు ఒక ప్రటకనలో తెలిపారు. ఇందులో భాగంగా, సీఏటీ(తెలుగు) 1, సీఆర్‌టీ(హిందీ) 1, సీఆర్‌టీ(బయోసైన్స్) 1, పీఈటీ 2, పీజీ సీఆర్‌టీ(తెలుగు) 1, పీజీ సీఆర్‌టీ(కెమిస్ట్రీ) 1, పీజీ సీఆర్‌టీ(సివిక్స్) 1, జిల్లా కేంద్రంలోని యూఆర్ఎస్ పాఠశాలలో సీఆర్‌టీ(మాథ్స్) 1 పోస్టులకు రోస్టర్ కామ్ మెరిట్ ప్రకారం 1:3 ప్రాతిపదికన ధ్రువపత్రాల పరిశీలన ఉంటుందని వివరించారు. అభ్యర్థుల జాబితా www.karimnagardeo.com వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు వివరించారు. వీరు 21వ తేదీ గురువారం ఉదయం 11 గంటలకు కరీంనగర్ డీఈవో కార్యాలయంలో హాజరు కావాలని సూచించారు. అభ్యర్థులు సంబంధిత ఒరిజనల్ సర్టిఫికెట్లు రెండు సెట్లు జిరాక్స్ ప్రతులు అటెస్టెడ్‌తో, 3 పాస్ ఫోర్ట్స్ ఫొటోలతో హాజరు కావాలని సూచించారు.

గ్రామీణ కళాజ్యోతి అవార్డులకు ఆహ్వానం

కమాన్‌చౌరస్తా, నవంబర్ 18 : కరీంనగర్ ఫోకార్ట్స్ అకాడమీ ప్రతి ఏటా ప్రదానం చేసే గ్రామీణ కళా జ్యోతి అవార్డుల ఎంట్రీలకు 41వ వార్షికోత్సవం సందర్భంగా ఆహ్వానం అందిస్తున్నట్లు నిర్వాహకులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జీవిత సాఫల్య పురస్కారం పద్య నాటకం వయసు 58 ఏళ్లు దాటి ఉండాలన్నారు. యువ పద్య నాటక గ్రామీణ కళా జ్యోతి, యువ జన సాంఘిక సేవా పురస్కారాలకు 35 ఏళ్ల లోపు వయసు కలిగి ఉండాలని, గ్రామీణ ప్రాంతంలో సేవా కార్యక్రమంలో పాల్గొన్న ధ్రువీకరణలు సమర్పించాలని, వయసుకు ఆధార్ సమర్పించాలని సూచించారు. జనరల్ కేటగిరీలో వాయిద్యం, కళలు, రచనలు, నాటక రచయితలు, పాటల రచయితలు, గాయకులు తమ ఎంట్రీ అని పంపాలని, దీనికి వయసుతో సంబంధం లేదని సూచించారు. ప్రత్యేక బాలల అవార్డులు గతంలో ప్రకటించినట్లు రుద్రోజు సహస్ర, లక్ష్మి, కిట్లు చరణ్ అందించనున్నట్లు వివరించారు. ఈ అవార్డులకు దరఖాస్తులు ఈ నెల 22వ తేదీ సాయంత్రం ఐదు గంటల వరకు పోస్ట్ ద్వారా ఎంట్రీలను పంపాలని చెప్పారు. దరఖాస్తులు జీ కృపాదానం, 15- 7- 47/2/2/2 రేకుర్తి, కొత్తపల్లి, కరీంనగర్‌కు పంపాలని, వివరాలకు 810 600 6238 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. ఈ నెల చివరి వారంలో స్థానిక కళాభారతిలో ప్రదానం చేయనున్నట్లు వివరించారు.

వైభవంగా గోదావరికి మహా హారతి

ధర్మపురిలో గోదావరికి హారతినిస్తున్న భక్తులు

ధర్మపురి/వెల్గటూర్, నవంబర్ 18: కార్తీక మాసాన్ని పురస్కరించుకొని ధర్మపురి, కోటిలింగాల క్షేత్రాల్లో గోదావరి మాతకు హారతి కార్యక్రమాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు. ధర్మపురిలో నృసింహుడి ఆలయం నుంచి పండితులు, అర్చకులు, భక్తులు హరినామస్మరణ సంకీర్తనల మధ్య శోభాయాత్రగా గోదావరి వద్దకు చేరుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మహిళలు, భక్తులతో కలిసి గోదావరి నదికి హారతినిచ్చారు. అలాగే కోటిలింగాల వద్ద పార్వతికోటేశ్వరస్వామి సన్నిధిలో గోదావరినదికి హారతి ఇచ్చారు. తెప్పోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, వేదపండితులు బొజ్జ రమేశ్‌శర్మ, సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, అర్చకులు నంబి శ్రీనివాసాచార్యులు,కోటిలింగాల ఈఓకాంతరెడ్డి, అర్చకులు పాల్గొన్నారు.